సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



మట్టి విగ్రహాలకు జై !
గణపతి మండపాల నిర్వాహకుల్లో ఎక్కువ మంది ఈసారి మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపనకు మొగ్గు చూపుతున్నారు. IIలో



కమ్యూనిస్టులు లేకపోవడంతోనే..
చట్టసభల్లో కమ్యూనిస్టులు లేకపోవడం వల్లే ప్రజావ్యతిరేక చట్టాలు వస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు పేర్కొన్నారు. IVలో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం
శుక్రవారం జిల్లాలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల మాత్రం ఉదయం జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఇస్రో శాస్త్రవేత్తకు సన్మానం



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మధురానగర్‌కు చెందిన వల్లూరి ఉమామహేశ్వరరావు ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేస్తూ చంద్రయాన్–3 పాలుపంచుకున్నారు. ఈమేరకు ఆయన గురువారం ఖమ్మం రాగా, 14వ డివిజన్‌లోని శ్రీసద్గురు సాయినాథ మందిరంలో ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ వల రాజు, ఆర్టీఏ జిల్లా సభ్యుడు వల్లభనేని రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న 'రేగులచెలక'



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న మంత్రి దయాకర్‌రావు

రఘునాథపాలెం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రామపంచాయతీ మండలంలోని రేగులచెలక ఎంపికైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కొర్లపాటి రామారావు, కార్యదర్శి సంగీత అవార్డు అందుకున్నారు. ఈకార్యక్రమం జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సున్నా వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొనగా, గ్రామాభివృద్ధి కోసం రూ.10లక్షల నిధులు కేటాయించారని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు.

రైతు రుణమాఫీ వివరాలు సేకరణ



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ సరిత

కారేపల్లి: ఇటీవల ప్రభుత్వం రైతుల రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. అయితే, కొందరు రుణమాఫీ జరగలేదని, ఇంకొందరు బ్యాంకర్లు బకాయిల కింద మినహాయించుకున్నారని ఫిర్యాదు చేస్తుండడంతో అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యవసాయాధికారి బి.సరిత గురువారం కారేపల్లి మండలంలో పర్యటించారు. పేరుపల్లి తదితర గ్రామాల్లో రైతులను కలిసిన రుణమాఫీ వివరాలు తెలుసుకున్నారు. వ్యవసాయాధికారులు కె.ఉమామహేశ్వరరెడ్డి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరువును పారదోలేందుకే సీతారామ



ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించిన మంత్రులు హరీశ్‌రావు, అజయ్‌కుమార్, పక్కన ఎంపీలు పార్థసారథిరెడ్డి, నామా, రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ, ఎమ్మెల్సీ మధు, మేయర్ నీరజ, తదితరులు

- రెండు, మూడు నెలల్లో సగం ప్రాంతానికి నీరు
- జిల్లాకు రెండు మెడికల్, జేఎన్‌టీయూ, నర్సింగ్ కళాశాలలు ఇచ్చాం
- ఖమ్మంపై కేసీఆర్‌కు ప్రేమ ఉన్నట్లే... ప్రజలూ కరుణ చూపాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభం, నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం జిల్లాను శాశ్వతంగా కరువు నుంచి తప్పించేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి సంకల్పించారని.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాలోని సగం ప్రాంతానికి రెండు, మూడు నెలల్లో నీళ్లు అందుతాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. అలాగే, మమత కళాశాల సిల్వర్‌జూబ్లీ, మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు 85వ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నాక ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించేందుకు సిద్ధంగా ప్రజలు

మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని తెలంగాణ ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఏమీ రాకముందే ఖమ్మంలో కుర్చీల కోసం, పదవుల కోసం కాంగ్రెసోళ్లు కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మాదిరి ఢిల్లీ, బెంగళూరు హైకమాండ్ పెత్తనం కాదని... తెలంగాణ ప్రజలే హైకమాండ్‌గా బీఆర్‌ఎస్ పార్టీ పనిచేస్తోందని తెలిపారు. హేమాహేమీ నాయకులు ఖమ్మంలో ఉండి కూడా ఇక్కడకు ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో కొత్తగూడెం, ఖమ్మంలో మెడికల్ కళాశాలలు, జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరయ్యాయన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఖమ్మం జిల్లాలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందన్నారు. ఇదే మాదిరి జిల్లా ప్రజల కరుణ కేసీఆర్‌పైనా, బీఆర్‌ఎస్ పార్టీపై ఉండాలని కోరుతున్నట్లు చెప్పారు. కాగా, సీతారామ పూర్తయితే కరువు అనే పదం ఖమ్మం డిక్షనరీలో ఉండదని తెలిపారు. ఇంత పెద్ద ప్రాజెక్టు అవసరమా అని కొందరు అన్నారని... ఈసారి కృష్ణా బేసిన్‌లో నీళ్లు లేకపోవడంతో ప్రాజెక్టు ఆవశ్యకత తెలిసిందని చెప్పారు.



మంత్రులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ర్యాలీలో బీఆర్‌ఎస్ శ్రేణులు



కుటుంబీకుల నడుమ కేక్ కట్ చేస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు

వచ్చే వర్షాకాలం నాటికి..

వచ్చే వర్షాకాలం నాటికి కృష్ణాలో నీళ్లు ఉన్నా లేకున్నా.. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లు పాలేరుకు అందిస్తామని హరీశ్‌రావు తెలిపారు. ఇది ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఖమ్మం జిల్లాపై ఉన్న ప్రేమకు నిదర్శమని చెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌ను ఖమ్మం జైలు, ఆస్పత్రికి తీసుకొస్తే ఇక్కడి ప్రజలు గుండెకు హత్తుకుని కాపాడుకున్నారన్నాని గుర్తు చేశారు. అందుకే కేసీఆర్‌కు జిల్లాపై ప్రేమ అని, శాశ్వత కరువు నుంచి తప్పించేందుకే సీతారామ ప్రాజెక్టుకు సంకల్పించారన్నారు. మరింత అభివృద్ధి జరగాలంటే ఉమ్మడి జిల్లా ప్రజల కరుణ, దీవెనలు కేసీఆర్‌పై ఉండాలని ఆయన తెలిపారు.

పదికి పది స్థానాలు ఇవ్వాలి..

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రెండు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నాడు 200 పడకలతో ఉన్న జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిని కేసీఆర్ 500 పడకలకు అప్‌గ్రేడ్ చేశారన్నారు. అలాగే ఏరియా ఆస్పత్రులు 100 పడకల స్థాయికి పెరగగా, బస్తీ దవాఖానాలు, కొత్తగా పీహెచ్‌సీలు ఏర్పాటయ్యాయన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. 2014, 2018లో ఇక్కడ ఒక్కో స్థానాన్నే ప్రజలు ఇచ్చారని... ఈసారి అభివృద్ధిని చూసి పదికి పది స్థానాలను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. ఎవరు ఎన్నిక కుట్రలు చేసినా ముఖ్యమంత్రి కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమైపోయిందని, ఖమ్మం జిల్లా భాగస్వామ్యం ఇందులో ఉండాలన్నారు. కాగా, నాడు మమత విద్యాసంస్థలపై అనేకమంది కుట్రలు పన్నినా... పేదలకు వైద్యమే లక్ష్యంగా ముందుకెళ్తూ ఈ స్థాయికి చేరిందని తెలిపారు.

వైద్య విద్య ఘనత కేసీఆర్‌దే..

బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశం, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని ప్రతీ జిల్లాకు మెడికల్ కళాశాల కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పారు. ఉమ్మడి జిల్లాకు రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, డీసీసీబీ, డీసీఎంఎస్, సుడా, మార్కెట్ చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, బచ్చు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, మమత వైద్య కళాశాల కరస్పాండెంట్ పువ్వాడ జయశ్రీ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతితోపాటు బానోతు మదన్‌లాల్, బాలసాని లక్ష్మీనారాయణ, గుండాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్ ఆర్టీసీ కార్మికుల ఏళ్ల నాటి కల ఫలించిందని.. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు ఆమోదం లభించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో ఆర్టీసీ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలస్యంగానైనా గవర్నర్ ఈ బిల్లుకు ఆమోదం తెలపడంపై ధన్యవాదాలు చెప్పారు. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు.. ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని వెల్లడించారు. దీర్ఘకాలికంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యపై దృష్టి సారించి ముఖ్యమంత్రి కేసీఆర్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకోగా.. ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టే అవకాశం తనకు కల్పించడంపై కేసీఆర్‌కు పువ్వాడ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జిల్లా కేంద్రంలో పర్యటన

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుక్రవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే సమావేశంలో 2, 3, 4, 8, 26వ డివిజన్లతో పాటు రఘునాథపాలెం మండలం బూడిదంపాడు, ఈర్లపూడి గ్రామాల లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను అందజేస్తారు. ఆతర్వాత మధ్యాహ్నం 12 గంటలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు.

'టెట్'కు ఏర్పాట్లు పూర్తి

- నేడు 54కేంద్రాల్లో పరీక్ష
- హాజరుకానున్న 23,403 మంది అభ్యర్థులు
- అమలులో నిమిషం నిబంధన

ఖమ్మం సహకారనగర్: టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో శుక్రవారం జరిగే ఈ పరీక్ష కోసం అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఖమ్మంలో 54 కేంద్రాలు ఏర్పాటు చేయగా 23,403మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. రెండు సెషన్లలో ఈ పరీక్ష జరుగుతుంది. ఉదయం 54 కేంద్రాల్లో జరిగే పరీక్షకు 12,923మంది, మధ్యాహ్నం పరీక్షకు 10,480మంది అభ్యర్థులు హాజరవుతారని అధికారులు వెల్లడించారు. పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ కోసం పది రూట్లు ఏర్పాటు చేయగా... ఎంఈఓలతో పాటు ఎంపీడీఓలను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. మొత్తం 54మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో ప్రతీ సెంటర్‌కు 11మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తిస్తారు.

పకడ్బందీగా నిర్వహణ

టెట్ పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే కలెక్టర్ గౌతమ్ పలుమార్లు సమీక్షించారు. అలాగే, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వివిధశాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికార యంత్రాంగం సూచించింది. ఉదయం పరీక్ష 9–30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2–30నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారు. పరీక్షకు అర గంట ముందు నుంచే అభ్యర్థులను అనుమతిస్తామని, నిమిషం నిబంధన ఉన్నందున, ఉదయం 9–30తర్వాత, మధ్యాహ్నం 2–30 గంటల తర్వాత అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. కాగా, విధులు కేటాయించిన ఉద్యోగులతో గురువారం డీఈఓ సోమశేఖరశర్మ సమావేశమై పలు సూచనలు చేశారు.

'సీతమ్మసాగర్'పై నేడు వాదనలు

- బ్యారేజీ నిర్మాణ పనులపై ఎన్‌జీటీలో అభ్యంతరాలు
- ద్విసభ్య కమిటీ నివేదకపై అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ పనులపై చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) శుక్రవారం వాదనలు కొనసాగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 320 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా బహుళార్థ సాధకంగా సీతారామ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అందులో భాగంగా అశ్వాపురం – దుమ్ముగూడెం మండలాల మధ్య గోదావరి నదిపై సీతమ్మసాగర్ పేరుతో బ్యారేజీ నిర్మిస్తోంది. అయితే బ్యారేజీ నిర్మాణం కారణంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పొలాలు, అడవులు మునిగిపోతాయంటూ కొందరు 2022లో గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో పర్యావరణంతో పాటు అన్నిరకాల అనుమతులు వచ్చేవరకు ప్రాజెక్టు పనులు ఆపాలంటూ 2022 ఏప్రిల్ 26న ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. అయితే ట్రిబ్యునల్ ఆదేశాలు పట్టించుకోకుండా పనులు కొనసాగుతున్నాయంటూ మరోసారి ఎన్‌జీటీని ఆశ్రయించారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి నివేదిక ఇవ్వాలంటూ 2023 మే చివరి వారంలో ద్విసభ్య కమిటీని నియమించింది.

జూలైలో నివేదిక

మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ శాఖకు చెందిన రీజనల్ డైరెక్టర్(హైదరాబాద్), గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డులో ఎస్ఈ స్థాయి అధికారులిద్దరితో కూడిన కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి గత జూలైలో నివేదిక అందించింది. కానీ నివేదిక లోపభూయిష్టంగా ఉందంటూ ఎన్‌జీటీ ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసింది. పని ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించింది. అనుమతులు లేకుండా పనులు చేస్తుండడం, ట్రిబ్యునల్ ఆదేశాలు ధిక్కరించడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని గోదావరి రివర్‌బోర్డు మేనేజ్‌మెంట్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలను ఆదేశించగా, శుక్రవారం వాదనలు జరగనున్నాయి.

పరిహారంపై పోరు

సీతమ్మసాగర్ బ్యారేజీని అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం దగ్గర నిర్మిస్తున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో 66 ఎకరాల భూమి సేకరించారు. ఒక్కో ఎకరానికి రూ. 8 లక్షల వంతున పరిహారం నిర్ణయించగా సంతృప్తి చెందని 34 మంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. నిర్వాసితుల్లో ఇంటికో ఉద్యోగం ఇవ్వడంతో పాటు ఎకరాకు రూ.30 లక్షల చొప్పున పరిహారం ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ అంశంపై గురువారం విచారణ జరిగినా తీర్పు రావాల్సి ఉంది.

చరిత్ర లిఖిస్తున్నారు...!

ఏ ఊరికి వెళ్లినా ఒక చెరువు.. గుడి.. పాఠశాల సర్వసాధారణంగా కనిపిస్తాయి. కానీ ప్రతీ గ్రామానికి ఓ చరిత్ర ఉంటుంది. తరాలు కరిగిపోతుంటే వారితో పాటు చరిత్ర కూడా కనుమరుగవుతోంది. భవిష్యత్ తరాల వారికి తమ గ్రామాల ప్రత్యేకతలు తెలియకపోగా, చెప్పేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రత్యేక చొరవ ప్రతీ గ్రామం చరిత్రను రికార్డులకు ఎక్కించాలని నిర్ణయించింది. అయితే, ఇదే విషయంలో అప్పటికే కృషి చేస్తున్న జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు చొరవ తీసుకోవడంతో విద్యార్థులు ఆసక్తిగా తమ గ్రామాల చరిత్రను వెలికితీసి పుస్తకరూపంలో తీసుకొస్తున్నారు. ఇదంతా చెప్పుకోవడానికి సాధారణ విషయంగానే ఉన్నా విద్యార్థులు ఎంతో శ్రమకోర్చి ఇప్పటికే 568 మంది గ్రామాల చరిత్రను సిద్ధం చేయడం విశేషం. – సాక్షి, ఖమ్మం డెస్క్



ఖమ్మం ఖిల్లాపై అధ్యాపకులతో కలిసి వివరాలు సేకరిస్తున్న విద్యార్థులు (ఫైల్)

- ముద్రితమవుతున్న మన 'ఊరు – మన చరిత్ర'
- విద్యార్థులే రచయితలుగా రికార్డుల్లోకి...
- చురుగ్గా పాల్గొంటున్న ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ విద్యార్థులు
- తెలంగాణ సాహిత్య అకాడమీ చొరవ, అధ్యాపకుల సహకారం
- ఇప్పటికే 568 గ్రామాల చరిత్ర సిద్ధం

మనల్ని మనం తెలుసుకునేలా...

ఏ గ్రామ ప్రజలైనా తమ ఊరి చరిత్రను తెలుసుకుంటే వారిని వారు తెలుసుకున్నట్లేనని చెప్పక తప్పదు. ప్రతీ ఊరు భిన్న సంస్కృతులు, సామాజిక వర్గాల కలయికగా ఉంటుంది. ఎవరిదో చరిత్ర అధ్యయనం చేసి దానినే గొప్పగా చెప్పుకునే బదులు ఏ గ్రామ చరిత్రను ఆ గ్రామస్తులే గుర్తించగలిగితే మంచి ఫలితాలు వస్తాయి. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కాలేజీ బీఏ చరిత్ర విభాగంలో మొదటగా 'మా ఊరి చరిత్ర' శీర్షికన సింగిల్ పేపర్ ప్రవేశపెట్టారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మకను పెంపొందించేందుకు దీనిని ప్రవేశపెట్టగా అంతా ఆసక్తి కనబరిచారు. ఆతర్వాత 2018 ఆగస్టు నుంచి హిస్టరీ విద్యార్థులు వారి గ్రామాల చరిత్ర, ఆధారాలను సేకరించారు. అనంతరం 2022 మే నెల నుంచి చరిత్ర విద్యార్థులకే కాకుండా కామర్స్, హిందీ, ఇంగ్లిష్‌తో పాటు సైన్స్ విద్యార్థులను కూడా ఇందులో భాగస్వాములను చేశారు.



గ్రామస్తులు రూపొందించిన 'మన ఊరు - మన చరిత్ర' రికార్డులు

'అకాడమీ'తో ఒప్పందం

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల చరిత్ర విభాగం విద్యార్థులు కొన్నేళ్ల క్రితం బృహత్ శిలా యుగానికి చెందిన సమాధుల తవ్వకాల్లో పాల్గొన్నారు. ఈసమయంలోనే ప్రతీ గ్రామానికో చరిత్ర ఉంటుందని, దాన్ని వెలికితీయాలనే ఆలోచనలకు నాంది పడింది. ఈమేరకు విద్యార్థులతో పరిశోధన చేయిస్తుండగానే తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాశాల విద్యా కమిషనరేట్ సంయుక్తంగా డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థుల కోసం మన ఊరు – మన చరిత్ర పరిశోధన ప్రాజెక్టును ప్రవేశపెట్టాయి. ఈమేరకు అకాడమీతో కళాశాల ఒప్పందం కుదుర్చుకోగా.. మరింత లోతుగా అధ్యయనం చేపట్టినట్లయింది.

న్యాక్ గ్రేడ్ సాధనలో కీలకం

ఈ ఏడాది జూలైలో న్యాక్ బృందం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా అన్ని విభాగాలను సందర్శించి వివరాలు ఆరా తీశాక... మన ఊరు – మన చరిత్ర పేరిట విద్యార్థులు చేపట్టిన ప్రాజెక్టును ఆసక్తిగా పరిశీలించారు. ఎంతో ప్రత్యేకంగా విద్యార్థులు చేపడుతున్న ప్రాజెక్టుకు బృందం ప్రభావితమైంది. తద్వారా కళాశాల న్యాక్ ఏ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించడంలో ఈ ప్రాజెక్టు కీలకపాత్ర పోషించిందని భావిస్తున్నారు.

ఆసక్తిగా విద్యార్థులు

గ్రామాల చరిత్రను రికార్డు చేసే బాధ్యతను విద్యార్థులకు అప్పగించిన మంచి స్పందన లభించింది. విద్యార్థులు ఆసక్తిగా తమ ఊరిలోని నదులు, ఏర్లు, వాగులు, వంకలు, బావులు, చెట్లు, పుట్టలు ఇలా ప్రతీ అంశాన్ని రికార్డు చేశారు. అలాగే, బోనాలు, బతుకమ్మ, జాతరలు, కులదైవాల మొక్కుల వివరాలు తెలుసుకున్నారు. కుల, మతాలకతీతంగా జీవనం సాగించే ప్రజల వివరాలు నమోదు చేశారు. ఊరు, నేల కోసం త్యాగం చేసిన మహనీయుల చరిత్రనూ రికార్డులకెక్కించారు.

పేరు ఎలా వచ్చింది...

ప్రతీ గ్రామానికో పేరు ఉండడం సాధారణమైన విషయం. కానీ ఆ పేరు ఎలా వచ్చిందో చాలా మందికి తెలియదు. ఈవిషయంలో కూడా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ప్రతీగ్రామం పేరు వివరాలను తెలుసుకునేందుకు పెద్దలతో చర్చించి, రికార్డులు పరిశోధించారు. అలాగే, నీటి వనరులు, వ్యవసాయం, సాగు చేస్తున్న పంటలు ఇత్యాది వివరాలను కూడా నమోదు చేయడంతో చాలా గ్రామాల చరిత్ర, విశేషాలు వెలుగులోకి వచ్చాయి.

పరిశోధనలకు దోహదం



మన ఊరు – మన చరిత్ర ప్రాజెక్టు విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించేందుకు దోహదపడుతోంది. గ్రామంతో పాటు వారి చుట్టూ ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేయడం ద్వారా మంచి అవగాహన ఏర్పడుతోంది. నేను ఈ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తూ ఇతర కళాశాలల విద్యార్థులూ రాసేలా అవగాహన కల్పిస్తున్నా.
– డాక్టర్ సీతారాం, జిల్లా కోఆర్డినేటర్

ప్రోత్సహిస్తున్నాం



'మన ఊరు – మన చరిత్ర' ప్రాజెక్టులో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. తృతీయ సంవత్సరంలోని ప్రతీ గ్రూప్ విద్యార్థి ఏదో ఒక చరిత్ర రాయాల్సి ఉంటుంది. మా కళాశాల నుంచి ఈ ఏడాది 568మంది విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. వీరు సేకరించిన విషయాలు భవిష్యత్ తరానికి చాటిచెప్పేలా దోహదపడతాయి.
– నాగూర్, హిస్టరీ అధ్యాపకుడు

పెద్దలతో చర్చించి...



మాది పాండురంగాపురంలోని బల్లేపల్లి. మన ఊరు–మన చరిత్ర ప్రాజెక్టులో భాగస్వామ్యమయ్యా. మా ఊరిలో వృత్తులు, వ్యవసాయం ఇలా వివరాలన్నీ సేకరించాను. ప్రతీ అంశంపై పెద్దలతో చర్చించి వివరాలన్నీ తెలుసుకుని రికార్డుల్లో నమోదు చేశా. తద్వారా ఊరి చరిత్ర నాకు తెలియడమే కాక అందరికీ చెప్పినట్లవుతోంది.
– ఎస్.కే.జాస్మిన్, బీఏ, చివరి సంవత్సరం

ఖమ్మం విశిష్టత తెలుసుకున్నా...



ప్రతీఒక్కరు వారి స్వస్థలం ప్రత్యేకతలను తెలుసుకోవడం అవసరం. అందుకే నేను నేను నా తల్లిదండ్రులు, పెద్దలను కలిసి ఖమ్మం ప్రత్యేకతలను తెలుసుకున్నా. ప్రధానంగా ఖమ్మం ఖిల్లాకు సంబంధించి తెలియని ఎన్నో అంశాలు చెప్పారు. ఖమ్మం ఖిల్లా రూపకల్పనలో శ్రీకృష్ణదేవరాయలు పాత్ర ఉన్నట్లు తెలిసింది.
– ఎస్‌డీ.ఫర్వీన్ సుల్తానా, బీఏ, చివరి సంవత్సరం

చింతగూడెమే ముత్తగూడెం



ఈ ప్రాజెక్టులో ఆసక్తిగా పాల్గొన్నా. మా ఊరి పెద్దలతో చర్చించి వివరాలు తెలుసుకున్నాను. ఈ చర్చల్లోనే మా ఊరి పేరు తొలినాళ్లలో చింతగూడెంగా ఉండగా.. ముత్తగూడెంగా మారిందని తెలిసింది. ఇంకా గ్రామ ప్రత్యేకతలపై అనేక విషయాలు తెలియగా.. గ్రామస్తులు, కళాశాల అధ్యాపకుల సహకారంతో ప్రాజెక్టు పూర్తిచేశాను.
– ఎస్.కృష్ణచైతన్య, బీఎస్సీ, మొదటి సంవత్సరం

క్లుప్తంగా

పువ్వాడకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీపీఐ నేతలు

ఖమ్మం మయూరిసెంటర్: సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వర రావును సీపీఐ నాయకులు గురువారం కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడగా నాయకులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్, దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, జానీమియా, కొండవర్తి గోవిందరావు, కార్పొరేటర్లు బీ.జీక్లెమెంట్, చామకూరి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఇల్లెందు డిపో ద్వారా బస్సులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఆర్టీసీ రీజియన్ పరిధి ఇల్లెందు శాటిలైట్ డిపో ద్వారా ఈనెల 17 నుంచి బస్సుల రాకపోకలు పూర్తిస్థాయిలో జరగనున్నాయి. డిపోను ఇటీవల ఏర్పాటుచేయగా, ఆ వెంటనే బస్సులు కేటాయించినట్లు ప్రకటించినా అనుకున్న స్థాయిలో రాకపోకలు జరగడం లేదు. ఈ మేరకు అధికారులు తాజాగా 55 మంది ఉద్యోగులను కేటాయించారు. ఇందులో డ్రైవర్లు, కండక్టర్లు 40 మంది ఉన్నారు. ఇక మూడు ఎక్స్‌ప్రెస్, రెండు సూపర్‌లగ్జరీ, తొమ్మిది పల్లె వెలుగు బస్సులు కేటాయించగా, ఈనెల 17 నుంచి రాకపోకలు పూర్తిస్థాయిలో మొదలవుతాయని అధికారులు వెల్లడించారు. అవసరం మేరకు కొత్త రూట్లతో పాటు రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచనున్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం ఖాయం



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నేలకొండపల్లి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ నేలకొండపల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని కూడా నెరవేర్చని బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పేందు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నున్నా రవికుమార్, అనంతు ఉపేందర్, పాగర్తి సుధాకర్, షర్ఫొద్దీన్, సూరేపల్లి జ్ఞానరత్నం, కోటి హన్మంతరావు, కాళంగి వెంకటేశ్వర్లు, తొగటి నాగచారి, దుర్గారావు, చల్ల మల్లేష్, కాసాని ఉదయ్, పోలంపల్లి వీరబాబు, గోపి, శ్రీనివాసరావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండవలో సీఎల్పీ నేత భట్టి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ముదిగొండ: మండలంలోని పెద్దమండవలో గురువారం రాత్రి మండలాధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు అధ్యక్షతన ముదిగొండ మండల 5వ జోన్ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క హాజరై ప్రసంగించారు. పార్టీలో క్రమశిక్షణ, కార్యకర్తల స్థాయి, జోన్‌ల విభాగంపై సమీక్షించారు. సమావేశంలో పీసీసీ సభ్యులు నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, బుల్లెట్‌బాబు, పసుపులేటి దేవేంద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కందిమళ్ల వీరబాబు, ఎంపీటీసీ వెంగళరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బెళగావి రైలు 16 రోజులు రద్దు

కొత్తగూడెంఅర్బన్: బెళగావి – మణుగూరు రైలును ఈనెల 16 నుంచి అక్టోబర్ 1 వరకు 16 రోజుల పాటు రద్దు చేశారు. ఈ విషయాన్ని భద్రాచలం రోడ్(కొత్తగూడెం) రైల్వే స్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

పల్లె దవాఖానాల్లో వైద్య ప్రమాణాల పరిశీలన

పాల్వంచరూరల్: మండల పరిధిలోని నాగారం గ్రామ పల్లెదవాఖానాలో గురువారం జాతీయ ప్రమాణాలు, అంచనాల పరిశీలన (ఎన్‌క్వాస్) బృందం సభ్యులు డాక్టర్ అమూల్య రతన్ మోహతి(ఒడిశా), డాక్టర్ రీతురాణి(పశ్చిమ బెంగాల్) సందర్శించారు. వైద్య ప్రమాణాలను, చికిత్స అందుతున్న తీరును పరిశీలించారు. ఇక్కడ రోగులకు అందిస్తున్న వైద్యసౌకర్యాలపై ఆరా తీశారు. ఇంకా ఏఏ సౌకర్యాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శృతి, జగన్నాథపురం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాజు, డీఐఓ డాక్టర్ బాలాజీ, డాక్టర్ మణికంఠరెడ్డి, డాక్టర్ తన్య, స్పందన పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలకు జై!



ఎనిమిది అడుగుల భారీ విగ్రహం

జోరుగా గణనాథుడి ప్రతిమల విక్రయం

వినాయక చవితి సమీపిస్తోంది. ఏటా మాదిరిగానే ఈసారి కొందరు పీఓపీ విగ్రహాలనే ఏర్పాటు చేయనున్నారు. కానీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరగడంతో ఎక్కువ మంది మట్టితో చేసిన గణనాథుడి ప్రతిమలు ప్రతిష్ఠించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం జిల్లాకేంద్రానికి కొన్ని నెలల క్రితం కోల్‌కతా నుంచి వచ్చి కళాకారులు ఇక్కడే ఉండి వినాయక విగ్రహాలను సిద్ధం చేశారు. ఎనిమిది అడుగుల వరకు విగ్రహాలను సిద్ధం చేయగా ఇప్పటికే అమ్ముడయ్యాయని చెబుతున్నారు. రూ.50 నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుండగా చాలా మంది ఆసక్తిగా కొనుగోలు చేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



వినాయక విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న దృశ్యం



భారీ మట్టి విగ్రహాలు



విగ్రహాలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

వందేళ్లకు సరిపడా గ్రంథాలయం



గ్రంథాలయం పనులను పరిశీలిస్తున్న ఎంపీ పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: ఈ ప్రాంత ప్రజల వందేళ్ల అవసరాలకు ఉపయోగపడేలా నూతన గ్రంథాలయాన్ని డిజైన్ చేశామని ఎంపీ బండి పార్థసారథిరెడ్డి తెలిపారు. సత్తుపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఎంపీ సమకూర్చిన నిధులతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, భవిష్యత్‌లో ఇంటర్నెట్ వినియోగం పెరగనున్నందున విద్యుత్ సంబంధ పనులు పక్కాగా చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే ఉత్తమ లైబ్రరీగా తీర్చిదిద్దుతున్నందున ఆవరణలో పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలు నాటాలని, లైబ్రరీ పాఠకులకు సౌకర్యంగా ఉండేలా ఏర్పాట్లుచేయాలని తెలిపారు. వచ్చే డిసెంబర్ కల్లా నిర్మాణ పూర్తిచేయాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మ చైర్మన్ వనమా వాసుతో పాటు చల్లగుండ్ల కృష్ణయ్య, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, గోగుల మూడి బాలాజీరెడ్డి, మోదుగు పుల్లారావు, అద్దంకి అనిల్, ఎస్.కే.చాంద్‌పాషా, మట్టా ప్రసాద్, నాగుల్ మీరా, మాధురి మధు, మల్లూరు అంకమరాజు, పర్వతనేని వేణు పాల్గొన్నారు.

పరామర్శ..

వేంసూరు: మండల పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన సీడీసీ డైరక్టర్ పుచ్చాకాయల శంఖర్‌రెడ్డి మాతృమూర్తి మంగతాయారు(74) మృతి చెందగా ఎంపీ బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్యే సండ్రవెంకట వీరయ్య, స్థానిక నాయకులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

- ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- ఐసీడీఎస్ కార్యాలయాల్లో ఉద్యోగుల అడ్డగింత



పెద్దతండా వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీలు సమ్మెను ఉధృతం చేశారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలనే తదితర డిమాండ్లతో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యాన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఈనెల 11న సమ్మెకు దిగారు. జిల్లాలో 700 మంది టీచర్లు, 600 మంది హెల్పర్లు సమ్మెలో పాల్గొంటున్నారు. అయినప్పటికీ లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా హెల్పర్ లేదా టీచర్ విధులు నిర్వర్తిస్తూ పోషకాహారాన్ని అందజేస్తున్నారు. కొన్నిచోట్ల మాత్రం ఇద్దరూ సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో ఆయా సెంటర్ల నిర్వహణ బాధ్యతలను పంచాయితీల కార్యదర్శులు, ఆశా వర్కర్లు లేదా సమీప కేంద్రాల నిర్వాహకులకు అప్పగించారు.

భిన్న రూపాల్లో నిరసనలు

నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం నిరసనల జోరు పెంచారు. కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఖమ్మం ప్రధాన రహదారిపై నల్ల రిబ్బన్లను కళ్లకు కట్టుకుని ధర్నా చేయడంతో పాటు ప్రభుత్వ దిష్టబొమ్మను దహనం చేశారు. మధిర ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఉద్యోగులు లోనకు వెళ్లకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. అలాగే, పెద్ద తండా వద్ద ఉన్న తిరుమలాయపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కార్యకర్తలు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. కాగా, గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జిల్లా పర్యటన సందర్భంగా పలుచోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంగన్‌వాడీలపై బెదిరింపు ధోరణి సరికాదు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెను విచ్ఛిన్నం చేసేలా అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సీపీఐ, సీపీఎం, ప్రజాపంథా జిల్లా కార్యదర్శులు పోటు ప్రసాద్, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో గురువారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యాన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులు గత 45ఏళ్లుగా పనిచేస్తుండగా కనీస వేతనం, ఇతరత్రా సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగారని తెలిపారు. అయితే, పరిష్కారంపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం, అధికారులు సమ్మె విచ్ఛిన్నానికి యత్నించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, టీడీపీ నాయకులు కూడా పాల్గొని మాట్లాడారు. నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, సింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, జి.రామయ్య, కె.శ్రీను, సీహెచ్.సీతామహాలక్ష్మి, కె.సుధ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు చేయూత



చెక్కులను అందజేస్తున్న జీఎం షాలెంరాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉద్యోగుల పిల్లలకు సింగరేణి సంస్థ చేయూతనందిస్తోందని కొత్తగూడెం జీఎం ఎం.షాలెంరాజు తెలిపారు. ఐఐటీల్లో చదువుతున్న కార్మికుల పిల్లలకు గురువారం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్కులు పంపిణీ చేశారు. జేవీఆర్ ఓసీ హెడ్ ఓవర్‌మెన్ విజయగిరి శ్రీనివాస్ కుమారుడు సంతోష్ ముంబై ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ చదువుతుండగా రూ. లక్ష, కోల్ శాంప్లింగ్ మజ్దూర్ కె.మహేష్‌బాబు కుమార్తె గీతిక హైదరాబాద్ ఐఐటీలో ఎంటెక్ చదువుతుండగా రూ.2.40 లక్షలు అందించినట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు రూ.8.5 కోట్లు విడుదల

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.8.5 కోట్లను విడుదల చేసింది. భద్రాచలంలో సెంట్రల్ లైటింగ్‌కు రూ.2.60 కోట్లు, ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌కు రూ.1.30 కోట్లు కేటాయించారు. భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో సీసీ రోడ్లకు, డ్రెయినేజీ నిర్మాణానికి నిధులను కేటాయించాలని ప్రభుత్వ ఉన్నతాధికారి కె. రామకృష్ణారావు కలెక్టర్‌ను ఆదేశించారు.

ఫోన్ చేసుకుంటానని నగదు స్వాహా

రూ.99 వేలు కాజేసిన గుర్తు తెలియని వ్యక్తి

వైరా: కిరాణం షాపులో సరుకుల కొనుగోలుకు వచ్చినట్లు నటించిన వ్యక్తి యజమాని ఫోన్ తీసుకుని రూ.99వేలు బదిలీ చేసుకుని పరారయ్యాడు. ఈ ఘటన వైరాలో గురువారం జరిగింది. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఎదురుగా సిరిపురపు సత్యనారాయణ కిరాణం షాపు నిర్వహిస్తుండగా, గురువారం మధ్యాహ్నం ఓ వ్యక్తి వచ్చి సరుకులు కొనుగోలు చేశాడు. తన వద్ద డబ్బులు లేవని యజమాని ఫోన్ నుంచి బంధువులకు ఒక్క రూపాయి పంపితే వాళ్లు బిల్లు చెల్లిస్తారని నమ్మబలికాడు. దీంతో ఆయన రూపాయి పంపాక ఆగంతకుడు బంధువులతో మాట్లాడాలని యజమాని నుంచి ఫోన్ తీసుకుని ఇంకో నంబర్‌కు రూ.99 వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. ఇంతలోనే ఇంకో వ్యక్తి వచ్చి ఫోన్ పే ద్వారా రూ.800 చెల్లించినట్లు చెప్పడంతో యజమాని పరిశీలిస్తుండగా ఆగంతకుడు పరారయ్యాడు. అతర్వాత యజమాని చూసుకోగా రూ.99 వేలు వేరే నంబర్‌కు బదిలీ అయినట్లు తెలియడంతో వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

కారేపల్లి: అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కొత్తతండా గ్రామానికి చెందిన బాదావత్ లక్ష్మణ్(55) కొంతకాలంగా శ్వాస సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోగా, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం ఉదయం చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడిపోయిన ఆయనను మేకల కాపరులు గుర్తించి ఇచ్చిన సమాచారంతో ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

ఆస్పత్రిలో రిటైర్డ్ ఉద్యోగి..

ఖమ్మంక్రైం: ఖమ్మం నెహ్రూనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న డీసీసీబీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం టూ టౌన్ సీఐ కుమారస్వామి కథనం ప్రకారం... విజయవాడ జమీందారు వీధికి చెందిన అంచా పెద్దసుబ్బారావు(65) ఖమ్మంలోని డీసీసీబీలో పనిచేసి రిటైర్ అయ్యారు. 2017నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ ఆస్పత్రిలో పైభాగంలో నివాసముంటున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి విధులు ముగించుకుని తన గదికి వెళ్లాడు. కాసేపటికి ఆ పక్కనే ఉన్న ఇంకో ఆస్పత్రి ఎండీ భవనంపైకి వెళ్లేసరికి సుబ్బారావు ఉరి వేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఘటనపై సుబ్బారావు సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రాంకుమార్ (ఫైల్)

ఎస్‌ఎస్ తాడ్వాయి: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వరంగల్ నుంచి ఏటూరునాగారం వైపునకు వెళ్తున్న ఓ కారును.. ఏటూరునాగారం వైపు నుంచి వస్తున్న బొలెరో తాడ్వాయి సమీపాన ఎత్తిబురు వద్ద ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన రాంకుమార్(40) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే, బొలెరోలో ప్రయాణిస్తున్న ఇద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై రాంకుమార్ బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్...



లక్యా(ఫైల్)

పాల్వంచరూరల్: జగన్నాథపురం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బుధవారం రాత్రి ఏపీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జగన్నాథపురం గ్రామానికి చెందిన మాళోతు లక్యా(50) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పాల్వంచ నుంచి కంకరలోడ్‌తో వెళ్లి ఏపీ రాష్ట్రంలోని లక్ష్మీపురంలో అన్‌లోడ్ చేశారు. బుధవారం రాత్రి తిరిగి వస్తుండగా లక్ష్మీపురం సమీపంలో డివైడర్‌ను ఢీకొని లారీ బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలై డ్రైవర్ మృతి చెందాడు. మృతునికి భార్య చిలకమ్మ, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్యా మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అదృశ్యం.. నాలుగు రోజుల తర్వాత ప్రత్యక్షం

ఇల్లెందు: పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నాలుగు రోజుల క్రితం అదృశ్యమై గురువారం ఇల్లెందులో ప్రత్యక్షమయ్యారు. మండలంలోని బొంబాయితండాకు చెందిన విద్యార్థులు ఈ నెల 11న ఇంటి నుంచి బయల్దేరి వచ్చారు. నివాసం ఉంటున్న బాలుర ఆశ్రమ పాఠశాలకు గానీ, ప్రైవేట్ స్కూల్‌కు గానీ చేరుకోలేదు. ఓ అపరిచిత వ్యక్తి వీరిని తనతో పాల్వంచకు తీసుకుని వెళ్లి గురువారం వదిలేయగా తిరిగి ఇల్లెందుకు చేరుకున్నారు. అప్పటికే కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గురువారం ఇల్లెందులో కనిపించారు. దీంతో ఇద్దరినీ కుటుంబీకులు తమ వెంట ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పాఠశాల హెచ్‌ఎం రామచంద్రయ్యను వివరణ కోరగా.. చాలా రోజుల నుంచి పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులను పంపించాలని నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులకు ఫోన్ చేసి కోరానని తెలిపారు. కానీ వారు పాఠశాలకు తీసుకురాలేదని, కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు.

ఫైర్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో పరిధిలోని కేటీపీఎస్ 5,6 దశల కర్మాగారంలో గతంలో పనిచేసిన ఫైర్‌మెన్ ఎం.రవితేజను విజిలెన్స్, సెక్యూరిటీ చీఫ్ ఎ.ముత్యం రెడ్డి సస్పెండ్ చేశారు. గతంలో కేటీపీఎస్‌లో పనిచేసిన రవితేజ సీనియర్ అధికారులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేశాడు. దీంతో అతనిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వైటీపీఎస్(దామరచర్ల)కు బదిలీ చేశారు. అయినా అతని వైఖరిలో మార్పు రాకపోగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ఓ మహిళకు అసభ్యకరమైన వీడియోలు పంపించాడు. తనను పెళ్లి చేసుకోవాలని వేధింపులకు దిగాడు. దీంతో ఆమె కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, అతనిని సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని విజిలెన్స్ ఓఎస్‌డీ వినోద్ కుమార్ ధ్రువీకరించారు.

సామర్థ్యాల సాధనే 'ఉన్నతి' లక్ష్యం

విద్యారణ్యపురి: అభ్యసన సామర్థ్యాల సాధనే 'ఉన్నతి' లక్ష్యమని హనుమకొండ డీఈఓ ఎం.డి.అబ్దుల్‌హై తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ పెట్రోల్ బంక్ సమీపాన ఉన్నత పాఠశాలలో ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాల ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు గురువారం రెండో దశ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అబ్దుల్ హై మాట్లాడుతూ ఉర్దూలో చదివే విద్యార్థులంతా గుణాత్మక విద్యను పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మాతృ భాషలోనే వారికి విద్యాబోధన చేయాలని సూచించారు. ఈశిక్షణలో జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్ పద్మావతి, రిసోర్స్‌పర్సన్లు రఫీ అహ్మద్, ఫాతిమా అత్తర్, రైసా తస్లీమ్ దుర్దన తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీకి ఫీవర్

గోదావరి పరీవాహక ప్రాంతంలో విజృంభిస్తున్న డెంగీ, విషజ్వరాలు

వర్షాలు, వరదలతో నిన్న మొన్నటి వరకు అవస్థలు • తిరిగి అవే ప్రాంతాల్లో మంచం పట్టిన జనం

సాక్షిప్రతినిధి, వరంగల్: జూలై ,ఆగస్టు మాసాల్లో కురిసిన ఎడతెరిపి లేని వర్షాలు గోదావరి పరీవాహక ఏజెన్సీ పల్లెలను కుదిపేశాయి. ఇప్పుడా ప్రాంతాలను విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. కొమురమ్‌భీం ఆసిఫాబాద్ జిల్లా మొదలు భద్రాద్రి కొత్తగూడెం వరకు అనేక గ్రామాలు డెంగీ, మలేరియాల వలయంలో బిక్కుబిక్కుమంటున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి పూర్వ వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పేషెంట్లతో కిటకిటలాడుతోంది. ఆయా జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. ఇప్పటికే ఎనిమిదిమంది వృద్ధులు, మహిళలు, బాలురు మృత్యువాత పడగా, 15 నుంచి 25 రోజులైనా తగ్గని జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటా జ్వరపీడితులే...

- వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు.. ఇప్పుడు డెంగీ, మలేరియా, విషజ్వరాలతో విలవిలలాడుతున్నాయి. మహా ముత్తారం, గణపురం, తాడిచర్ల, రేగొండ, కాటారం, మొగుళ్లపల్లి పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 250 మంది ఔట్‌పేషెంట్లుగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.
- ములుగు జిల్లా వెంకటాపురం, మంగపేట, వాజేడు, ఏటూరునాగారం మండలాల్లోని పల్లెలు మంచం పట్టాయి. జిల్లాలో గత జనవరి నుంచి 51 మలేరియా, 18 డెంగీ కేసులు నమోదయ్యాయి.
- పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం తదితర మండలాల్లోని 39 గ్రామాల్లో డెంగీ, విషజ్వరాలు జనాలను జడిపిస్తున్నాయి. ముత్తారం మండలంలో బేగంపేటకు చెందిన ఓ మహిళ మృతి చెందగా... డెంగీ బాధితుల సంఖ్య 89కి చేరినట్టు అధికారులు ప్రకటించారు.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు, దంతాలపల్లి, మరిపెడ, కొత్తగూడ, గంగారం, కేసముద్రం, గార్ల తదితర మండలాల్లో డెంగీ, విషజ్వరాలు జడలు విప్పాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, విషజ్వరాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా 162, డెంగీ 273, విషజ్వరాలు 2,35,835 కేసులు నమోదయ్యాయి.

ములుగు జిల్లాలో | డెంగీతో నలుగురు మృతి

- వారికి దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉండటం వల్లేనంటున్న అధికారులు
- సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష
- 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మరణించారని ఆ జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అయితే వారు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, జాండిస్, సికిల్ సెల్ అనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వైద్యాధికారులు డెంగీ మరణాలపై మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లోనే 10 మంది మరణించారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు.

జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు...

రాష్ట్రంలో అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. పిల్లల జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్న అంశాలను మంత్రి వివరించారు. డెంగీ కేసులు పెరుగుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఫీవర్ కేసులు ఆందోళనకర స్థాయిలో లేవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఒక్క మరణం కూడా నమోదు కాలేదన్నారు. జ్వర బాధి తుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమో దు చేయాలని, ఆ డేటా ఆధారంగా డీఎంహెచ్ వోలు హైరిస్క్ ఏరియాలను గుర్తించి జాగ్రత్త చర్య లు చేపట్టాలన్నారు. జిల్లాల్లో 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. మీడియా సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్‌ను కొత్తగూడెం పంపి, అక్కడి పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు

ఇద్దరు మహిళలు, డెంగీతో ఆరు నెలల పాప మృతి



రజని (ఫైల్) మనీష (ఫైల్) మినహ (ఫైల్)

వాజేడు/కన్నాయిగూడెం: ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఐదుగురు చనిపోయారు. బుధవారం ఇద్దరు చనిపోగా, గురువారం మరో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఆరు నెలల పాప ఉండడం గమనార్హం. ములుగు జిల్లా వాజేడు మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం రజని (35), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో నివాసి మనీష (30) విషజ్వరంతో మృతిచెందారు. వాజేడు మండల పరిధిలోని దేవాదుల గ్రామానికి చెందిన ఆరు నెలల పాప కూడా డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు 54 టెండర్లు

- మొత్తం 25 లాట్లలో 8 లాట్లకు ఒక్కొక్కరే బిడ్డింగ్
- మిగతా 17 లాట్లకు 46 సంస్థల పోటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లుల్లో మూలుగుతున్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంచి స్పందన లభించింది. తొలి విడతగా 25 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యాన్ని విక్రయించాలని భావించిన పౌరసరఫరాల సంస్థ ఈ మేరకు గత నెలలో టెండర్లను ఆహ్వానించింది. 25 ఎల్ఎంటీల ధాన్యాన్ని 25 లాట్లుగా విభజించి , ప్రతి ఎల్ఎంటీ ఒక లాట్‌గా ఆన్‌లైన్‌లో బిడ్స్ ఆహ్వానించింది. గురువారంతో గడువు ముగియగా, సాయంత్రం 5 గంటలకు అధికారులు టెక్నికల్ బిడ్లు తెరిచారు. 25 లాట్ల కోసం మొత్తం 54 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో 8 లాట్లకు సంబంధించి కేవలం ఒక్కో బిడ్ మాత్రమే దాఖలైనట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా 17 లాట్ల కోసం 46 సంస్థలు పోటీ పడ్డాయి.

యాసంగిలో 66.85 ఎల్ఎంటీల ధాన్యం సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా గత యాసంగి (2022-23)లో 66.85 ఎల్ఎంటీల ధాన్యాన్ని సేకరించారు. ఈ మొత్తం ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేయగా, అందులో కొంత భాగం అకాల వర్షాల కారణంగా తడిచిపోయింది. తడిచిన ధాన్యంతో పాటు మిగతా ధాన్యాన్ని కూడా ముడి బియ్యంగా మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లు నిరాకరించారు. బాయిల్డ్ రైస్‌గా మాత్రమే ఇస్తామని చెప్పినా, కేంద్రం నిబంధనలతో అది సాధ్యం కాలేదు.

సినిమాల్లోని సీన్లపైనా నజర్

- డ్రగ్స్ వినియోగం ప్రేరేపించేలా ఉంటే చర్యలు
- ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమా టీమ్‌కు నోటీసులు
- బాలీవుడ్‌పైనా దృష్టి పెట్టేలా ఎన్సీబీకి సమాచారం
- హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్-నాబ్) అధికారులు మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న జరిగిన ఓ డ్రగ్ పార్టీపై దాడి చేశారు. ఆ ఫ్లాట్‌లో కనిపించిన సీన్... ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమాలోని సీన్లకు మధ్య సారూప్యత ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్, టీఎస్ నాబ్ డైరెక్టర్ సీవీ ఆనంద్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న ఆ సన్నివేశాలకు సంబంధించి చిత్ర యూనిట్‌కు నోటీసులు ఇచ్చామని, వారు తమ ఎదుట హాజరై వివరణ ఇచ్చారని గురువారం చెప్పారు. అందులో ఉన్న సీన్లపై తాము చెప్పిన తర్వాతే సినిమాలో వార్నింగ్ నోట్ పెట్టారని, అప్పటివరకు అలాంటిది కూడా లేదని అన్నారు. ఇలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలను సినిమాల్లో పెట్టవద్దని ఆనంద్ హితవు పలికారు. వీటి ద్వారా స్ఫూర్తి పొంది అనేక మంది యువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలోనూ ఇలాంటి సీన్లతో కూడిన సినిమాలు వచ్చాయని, అయితే వాటిని ఎవరూ పట్టించుకోలేదని చెప్పిన ఆనంద్.. ఇకపై ఈ తరహాలో ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'టాలీవుడ్ లింకులు ఉన్న డ్రగ్స్ కేసు'లో పరారీలో ఉన్న సూర్య.. స్నార్ట్ అనే పేరుతో పబ్ నిర్వహిస్తున్నాడని, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను స్నార్టింగ్ ప్రక్రియ ద్వారా వినియోగిస్తారని చెప్పారు. దీన్ని బట్టి సూర్య తన



వద్ద మాదకద్రవ్యాలు లభిస్తాయని అర్థం వచ్చేలా తన పబ్‌కు పేరు పెట్టాడని భావించాల్సి వస్తోందని ఆనంద్ వ్యాఖ్యానించారు. బాలీవుడ్ చిత్రాల్లోనూ డ్రగ్స్‌ను ప్రేరేపించే సీన్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను (ఎన్సీబీ) కోరతామన్నారు. ఎన్సీబీ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నారని, దీన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. తాము ఇటీవల కాలంలో 33 మంది నైజీరియన్లను అరెస్టు చేయగా, వారిలో 18 మంది బెంగళూరులో స్థిరపడిన వారిగా తేలిందన్నారు. టీఎస్ నాబ్ సేవల విస్తరణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరతామని చెప్పారు.

టాలీవుడ్ తెరపై మరో డ్రగ్ మరక

▶ మొదటి పేజీ తరువాయి

బెంగళూరు డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో రేవ్ పార్టీలు ఏర్పాటు నిర్వహించేవాడు. స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి దీని ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈ యాప్‌లో మెసేజ్ చదవగానే డిస్‌అప్పియర్ అయ్యే ఆప్షన్ ఉండటంతోపాటు కస్టమర్లకు ప్రత్యేక కోడ్‌లు ఇవ్వడం ద్వారా దందా సాగించాడు. గత నెల 31న ఇతడితోపాటు రమణారెడ్డి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పని చేస్తున్న డి.మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించడంతో ఈ డ్రగ్స్ మూలాలు బయటపడ్డాయి.

నైజీరియన్ల ద్వారా రామ్ కిషోర్‌కు...

బాలాజీ ముగ్గురు నైజీరియన్లతోపాటు నగరానికి చెందిన రామ్ కిషోర్ వైకుంఠం (పరారీలో ఉన్నాడు) నుంచి డ్రగ్స్ ఖరీదు చేసేవాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమోబీ చికోడి మొనగాలు, ఇక్బావే మైకేల్, థామస్ అనఘకాలు నుంచి బాలాజీకి కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ అందుతున్నాయి. డ్రగ్ పార్టీల నిర్వహణకు బాలాజీకి రమణా రెడ్డి ఫైనాన్స్ చేస్తుండేవాడు. ఇతడికి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా ఉంది. ఇందులో ప్రస్తుతం రూ.5.5 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రమణారెడ్డి, బాలాజీలకు ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన 18 మంది కస్టమర్లలో సినీ రంగానికి చెందిన వారితోపాటు పబ్‌లు, స్నూకర్ పార్లర్ల నిర్వాహకులు ఉన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో స్నార్ట్ పబ్ నిర్వహించే సూర్య, జూబ్లీహిల్స్‌లో టెర్రా కేఫ్ అండ్ బిస్ట్రో నిర్వహించే అర్జున్, గుంటూరులో స్నూకర్ పార్లర్ నిర్వహించే పీఎస్ కృష్ణ ప్రణీత్ కీలకం. వీరు తమ సంస్థల్లోనే రహస్య గదులు ఏర్పాటుచేసి డ్రగ్స్ వినియోగానికి సహకరిస్తూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్లు ఆఫ్ చేసుకున్న నవ్‌దీప్, రవి

బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్న వారిలో సినీ రంగానికి చెందిన వారూ ఉన్నట్లు టీఎస్ నాబ్ గుర్తించింది. హీరో నవదీప్, షాడో, రైడ్ చిత్రాల నిర్మాత రవి ఉప్పలపాటి, మోడల్ శ్వేత, మాజీ ఎంపీ దేవరకొండ విఠల్‌రావ్ కుమారుడు సురేశ్ రావ్, ఇంద్రతేజ్, కార్తీక్‌లతోపాటు కలహర్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బెంగళూరులో జరిగిన డ్రగ్ పార్టీకి హాజరయ్యారనే విషయం 2021లో వెలుగులోకి వచ్చి కలకలం సృష్టించింది. ఈ పార్టీ నిర్వాహకుడు కలహర్‌రెడ్డే కావడం గమనార్హం. మరోపక్క ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేసిన 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులోనూ నవదీప్ పేరు ఉంది. నిందితుల కోసం ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరుల బృందం గాలించింది. అమోబీ చికోడి, ఇక్బావే మైకేల్, థామస్‌తోపాటు సురేశ్ రావ్, కొల్లి రామ్‌చంద్, కూరపాటి సందీప్, అనుగు సుశాంత్ రెడ్డి, కృష్ణ ప్రణీత్‌లను పట్టుకుంది. రూ.10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. నవదీప్, రవి ఉప్పలపాటి ఫోన్లు ఆఫ్ చేసుకుని, కుటుంబంతో పరారయ్యారు.

జిల్లా వార్తలు

మంత్రి కేటీఆర్‌ను కలిసిన సీతమ్మసాగర్ నిర్వాసితులు

అశ్వాపురం: మండలంలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ భూనిర్వాసితులు హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుతో పాటు మంత్రిని గురువారం కలిసిన వారు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టులో తమ కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు, రైతులు గజ్జల లక్ష్మారెడ్డి, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, నేలపట్ల సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరసింహాచారి, సత్యం, దాసరి సత్యనారాయణ, సయ్యద్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ల పరిశీలన

మణుగూరు రూరల్: సింగరేణి పరిధిలోని మణుగూరు ఏరియా ఓసీ-4, మణుగూరు ఓసీ సింగరేణి డైరెక్టర్లు ఎస్‌వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డి గురువారం సందర్శించారు. ఈసందర్భంగా వ్యూ పాయింట్ల నుండి బొగ్గు ఉత్పత్తి, రవాణాను పరిశీలించిన వారు రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, వీరభద్రుడు, రవీందర్, శ్రీనివాస్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

భూమి కోసం వెళితే.. ప్రాణమే పోయింది

దమ్మపేట: భూదాన్ భూముల్లో అటవీ అధికారులు చెట్లు పెంచారంటూ జామాయిల్ చెట్లు నరుకుతుండగా, చెట్టు మీద పడి ఓ మహిళ మృతిచెందిన ఘటన దమ్మపేట మండలం నాగుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ప్లాంటేషన్ మేనేజర్ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. నాగుపల్లి రేంజ్ పరిధి నల్లివారిగూడెం రిజర్వ్ ప్లాంటేషన్ భూములను ప్రభుత్వం తమకు ఇచ్చిన భూదాన్ భూములుగా చెబుతున్న గిరిజనులు చెట్లు నరుకుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని అటవీ అధికారులు, గిరిజనులకు సర్దిచెప్పారు. కాగా, అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గురువారం సర్వే చేసి అవి రిజర్వ్ ఫారెస్ట్ భూములేనని ధ్రువీకరించారు. అయితే సాయంత్రం మళ్లీ గిరిజనులు ఆ భూముల్లోకి వెళ్లి జామాయిల్ చెట్ల నరికివేత ప్రారంభించారు. అడ్డుకోబోయిన అధికారులను దగ్గరకు రానివ్వకుండా నిలువరించారు. ఈ క్రమంలో చెట్లు నరుకుతుండగా ఓ చెట్టు ప్రమాదవశాత్తు నాగుపల్లికి చెందిన బొర్రా తిరుపతమ్మ(45)పై పడింది. ఆమె తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది దమ్మపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మృతిచెందింది.

'మమత'లో సిల్వర్ జూబ్లీ వేడుకలు



కాలేజీ సావనీర్‌ను విడుదల చేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ నామ, పువ్వాడ నాగేశ్వరరావు, కళాశాల సెక్రటరీ జయశ్రీ, మేయర్ నీరజ, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు తదితరులు

- నూతన బ్లాక్‌ను ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు
- ఇదే వేదికపై పువ్వాడ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీ స్థాపించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇదే వేదికపై మమత కాలేజీ ఫౌండర్ మాజీ ఎమ్మెల్సీ పువ్వాడ నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు కూడా జరిగాయి. తొలుత కాలేజీ ఆవరణలో నిర్మించిన సిల్వర్ జూబ్లీ బ్లాక్‌ను మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. అతర్వాత కాలేజీ సావనీర్‌ను ఆవిష్కరించగా పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడారు. సంఘర్షణ విధానాన్ని మానుకుని అందరూ సామరస్యంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని తెలిపారు. తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అనేక ఒడిదుడుకులు ఎదురైనా కాలేజీని నిర్వహించామని, ఇందులో డైరెక్టర్లు అండగా నిలిచారని తెలిపారు. దివంగత పెద్దలు చేకూరి కాశయ్య, ఉడతనేని సత్యం తదితరులు చేసిన సూచనలతో ఈ స్థాయికి చేరుకున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో మమత విద్యాసంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, పువ్వాడ కుటుంబీకులు వసంతలక్ష్మి, నయన్ - అపర్ణ, నరేన్ - శిరిణితో పాటు ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ హరిప్రియ, మేయర్ పి.నీరజ, విత్తనాభివృద్ధి సంస్థ, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్, సుడా చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, కమల్‌రాజు, కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ బీ.జీ.క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు. కాగా, దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు గాను రోటరీ క్లబ్‌కు మంత్రి పువ్వాడ రూ.3.40లక్షలు, మున్నేరు వరద బాధితులకు పరిహారం చెక్కులు అందజేశారు.

ఫుట్‌బాల్ శిక్షణ శిబిరానికి ఐదుగురి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 16వ తేదీ నుంచి నిజామాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ జట్టు శిక్షణా శిబిరానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఈ శిబిరంలో రమ్యశ్రీ, నవ్యశ్రీ, కిరణమ్మయి, సీహెచ్.చిత్ర, టి.తేజ పాల్గొననుండగా, ప్రతిభ కనబరిస్తే జాతీయస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికవుతారు. ఐదుగురు కూడా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే కాగా, ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు కే.ఈ.సెల్యూకాస్, కళ్యాణపు ఆదర్శ్ కుమార్ అభినందించారు.

అక్టోబర్ 15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో వచ్చేనెల 15 నుంచి 23 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు రోజుకో అలంకరణలో దర్శనమిస్తారు. 15న ఆదిలక్ష్మిగా, 16న సంతానలక్ష్మి, 17న గజలక్ష్మి, 18న ధనలక్ష్మి, 19న ధాన్యలక్ష్మి, 20న విజయలక్ష్మి, 21న ఐశ్వర్యలక్ష్మి, 22న వీరలక్ష్మి, 23న మహాలక్ష్మిగా అమ్మవారిని అలంకరిస్తారు. 24న విజయదశమి సందర్భంగా విజయోత్సవం, ఆయుధ పూజ, శ్రీరామ్ లీలా మహోత్సవం నిర్వహిస్తారు.

18 నుంచి భాద్రపద మాస పూజలు

ఆలయంలో ఈనెల 18 నుంచి భాద్రపద మాస పూజలు జరగనున్నాయి. వినాయక చవితి వేడుకలతో పాటు నిమజ్జనానికి భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున 27, 28 తేదీల్లో దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లతో పాటు అదనంగా ప్రసాదాలు సిద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు.

ఎస్‌బీఐలో ఈ - హుండీ ఏర్పాటు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ కార్యాలయాల్లో శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయం ఆధ్వర్యాన గురువారం ఈ - హుండీలు ఏర్పాటుచేశారు. దేవస్థానంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదానానికి విరాళాల సేకరణ కోసం ఈ - హుండీలు ఏర్పాటుచేసినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నగదు రహిత లావాదేవీలపై భక్తులు ఆసక్తి చూపుతున్నందున క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఎస్‌బీఐ బ్రాంచ్‌ల్లో ఏర్పాటు చేశామని, వీటి ద్వారా విరాళాలు అందజేయవచ్చని వివరించారు.

ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- ఉత్తమ ఫలితాల కోసం వంద రోజుల కార్యాచరణ
- ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న పీఓ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. ఈమేరకు వంద రోజుల కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. అన్ని పాఠశాలల్లో సిలబస్‌ను జనవరి 10వ తేదీలోపు పూర్తిచేయాలని తెలిపారు. ఆతర్వాత జనవరి 11నుంచి మార్చి వరకు విద్యార్థులను అన్ని సబ్జెక్టుల్లో తీర్చిదిద్దేలా వంద రోజుల కార్యాచరణ అమలుచేయాలని సూచించారు. వర్క్‌బుక్‌ల సాయంతో బోధిస్తూ ప్రత్యేక పరీక్షలు నిర్వహించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలని పీఓ తెలిపారు.

కెరీర్ గైడెన్స్ తప్పనిసరి

గిరిజన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించేలా కెరీర్ గైడెన్స్ అవసరమని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. నిర్మాణ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక వాహనాన్ని ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు ఈనెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు వాహనం ద్వారా సంస్థ బాధ్యులు వెళ్లి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉన్నతస్థాయికి ఎదిగేందుకు ఉన్న అవకాశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈకార్యక్రమాల్లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్యతో పాటు కళింగ, సాయిబాబా, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తివేత



చర్ల : తాలిపేరు నుంచి విడుదలవుతున్న వరద

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు గేట్లను గురువారం పూర్తిగా ఎత్తివేసి వరదను విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74మీటర్లు కాగా, నీటిమట్టాన్ని 72.91మీటర్లుగా క్రమబద్ధీకరిస్తూ 25గేట్లలో 14గేట్లను అడుగు మేర, 11గేట్లను పూర్తిగా ఎత్తి 82,917క్యూసెక్కుల చొప్పున వరదను గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 84,192 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని డీఈ తిరుపతి తెలిపారు.

కిన్నెరసానికి కొనసాగుతున్న వరద

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. మొత్తం 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయంలోకి 400 క్యూసెక్కుల వరద చేరగా, గురువారం నీటిమట్టం 405.50 అడుగులకు చేరింది. అయితే, ఇంకా వరద పెరిగితే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తామని డ్యామ్ సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ సురేష్ తెలిపారు.

కమ్యూనిస్టులు లేకే ప్రజావ్యతిరేక చట్టాలు



సీతారామయ్య స్థూపం వద్ద మాట్లాడుతున్న సాంబశివరావు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కొణిజర్ల: పార్లమెంట్, అసెంబ్లీలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడంతో ప్రజావ్యతిరేక చట్టాలు పుట్టుకొస్తున్నాయని.. ఈ నేపథ్యాన కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరముందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా కొణిజర్ల మండలం తనికెళ్లలో మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య స్మారక స్థూపం వద్ద గురువారం ఆయన నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంతో రజాకారులు చిత్రహింసలు పెట్టినా నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి పోరాడిన వారిలో సీతారామయ్య ఒకరని కొనియాడారు. ఖమ్మం జిల్లాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 4వేల మంది సాయుధ పోరాటంలో అమరులయ్యారని గుర్తుచేశారు. ఈ పోరాట స్ఫూర్తితో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాగా, బీజేపీ తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ - ముస్లిం పోరాటంగా చిత్రీకరించడానికి చేస్తున్న యత్నాలను తిప్పికొట్టాలని సూచించారు. ఇక బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాయుధ పోరాటాన్ని స్మరిస్తే కమ్యూనిస్టుల పేర్లు వల్లె వేయాల్సి వస్తుందని పోరాటాన్ని గుర్తించడం లేదని ఆరోపించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, దొండపాటి రమేష్, పోటు కళావతి, తాటి నిర్మల, తోట రామాంజనేయులు, జానీమియా, పీ.వీ.రావు, కె.విష్ణుమూర్తి, జి.లక్ష్మీనారాయణ, ఎల్.గోపాల్‌రావు, మణిగె కోటేశ్వరరావు, పాపిట్ల ఏసు, యాసా వెంకటేశ్వరరావు, గడల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.